క్లుప్తంగా

అంజయ్యకు అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న అంజయ్య

కందుకూరు: కందుకూరు లయన్స్ క్లబ్ చార్టర్ కార్యదర్శి తాళ్ల అంజయ్య లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఎక్స్‌టెన్షన్ అవార్డును అందుకున్నారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్ లయన్స్‌క్లబ్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ ఎస్.నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ....17 సంవత్సరాలుగా లయన్స్‌క్లబ్‌లో అనేక సేవలు అందిస్తూ కొత్తగా రెండు క్లబ్‌లను ఏర్పాటు చేసినందుకు అవార్డు అందించామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ్, వైస్ గవర్నర్లు డి.కోటేశ్వరరావు, డాక్టర్ జి.మహేంద్రకుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, కార్యదర్శి జనార్దన్, సభ్యుడు విష్ణువాసురెడ్డి, కోశాధికారి ఎంవీ చారి, రఘు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ హైస్కూల్‌లో క్రీడాపోటీలు

బడంగ్‌పేట్: బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ సంబురాలను పురస్కరించుకుని సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, మ్యూజికల్ చైర్, పాటలు, ఉపన్యాస, బాలికలకు ప్రత్యేకంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీటితో పాటు రిక్రియేషన్ గేమ్స్, లాంగ్ జంప్, హైజంప్, గుండు విసరడం, తాడు లాగుట, మ్యాథమెటిక్స్ క్రీడలకు సంబంధించిన క్రీడలు సైతం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం రోజున బహుమతులు అందచేస్తామని ప్రధానోపాధ్యాయులు కె.అర్జున్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ సాములు, ఉపాధ్యాయులు, పాఠశాల పేరెంట్స్ విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన గ్రామస్తులు



మొక్కలు నాటుతున్న సర్పంచ్ తదితరులు

కందుకూరు: అయోధ్యలోని శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండల పరిధిలోని బాచుపల్లిలో సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ప్రజలందరిని శ్రీరామచంద్రుడు రక్షించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ కొంతం ప్రేమలత బాల్‌రెడ్డి, వార్డు సభ్యుడు విన్సెంట్‌రెడ్డి, టీఏ బాల్‌రెడ్డి, క్షేత్రసహాయకుడు రాములు, యూత్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరిగౌడ్, వినోద్‌గౌడ్, కారోబార్ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హుడాకాంప్లెక్స్, కమలానగర్, శారదానగర్, సరూర్‌నగర్, పుష్పాగార్డెన్, డెంటల్ కాలేజ్, నేతాజీనగర్, నర్సింహపురికాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 11కేవీ స్టేడియం, చిత్ర లేఅవుట్, రంగారెడ్డి జిల్లా కోర్టు, శివగంగకాలనీ, ఖిల్లా మైసమ్మ దేవాలయం, సిరినగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమోట లోకల్ 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 45, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 19, క్యారెట్ 25, దొండ 21, ఆలు 23, ఉల్లి 22, గోకర 45, దోస 21, సొరకాయ 9, పొట్ల 13, అరటికాయ 9, చిక్కుడు 28, అర్వి 65, మునగ 75, చిలగడదుంప 55, బీట్‌రూట్ 15, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, కాప్సికమ్ 50. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రాహుల్ పై దాడి హేయం

ఎల్‌బీనగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై జరిగిన దాడి హేయమైన చర్య అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా అస్సాం నిర్వహిస్తున్న పాదయాత్రలో ఆయనపై జరిగిన దాడిని సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు.



బాలాపూర్ వేణుగోపాలస్వామి టెంపుల్‌లో రామయ్య పట్టాభిషేకం కార్యక్రమంలో మేయర్ పారిజాత, నాయకులు

ఊరూరా రామజపం

అయోధ్యలో రామ్‌లాల్ల విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.. ఊరూరా ర్యాలీలు, ఊరేగింపులతో సందడి నెలకొంది.. రామనామ స్మరణతో వీధులు మార్మోగాయి. ఆయా ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. –సాక్షి, నెట్‌వర్క్



అయోధ్య కరసేవకులను సన్మానిస్తున్న బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం సభ్యులు



అల్మాస్‌గూడలో పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్న కార్పొరేటర్లు, ఇతర నేతలు



బడంగ్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అన్నపూర్ణనగర్ కాలనీ మహిళలు



కరసేవకులు జంగయ్య, నర్సింహారెడ్డిలను సన్మానిస్తున్న గ్రామస్తులు



అమీర్‌పేట్ గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో..



అల్మాస్‌గూడలో కరసేవకులను సన్మానిస్తున్న నాయకులు



కందుకూరు: తిమ్మాపూర్‌లో శ్రీరాముడికి అభిషేకం చేస్తున్న భక్తులు



కందుకూరు: బిగ్ స్క్రీన్‌పై అయోధ్యలో జరిగే పూజా కార్యక్రమాలను వీక్షిస్తున్న భక్తులు



జిల్లెలగూడ లార్డ్స్ స్కూల్‌లో..



మీర్‌పేటలో శ్రీరామ కీర్తనల భజనలో పాల్గొన్న భక్తులు



తుక్కుగూడ : శ్రీరాముని ఆకారంలో విద్యార్థులు



పహాడీషరీఫ్: మామిడిపల్లిలో పూజల్లో పాల్గొన్న రామ భక్తులు

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డికి విన్నవించారు. ఈ మేరకు మాజీ ఎంపీటీసీ షేక్ అఫ్జల్, పార్టీ నాయకులు సయ్యద్ హుస్సేన్, అజ్జులు సోమవారం ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి సమస్యలు వివరించారు. వాదే ముస్తఫా బస్తీలో ఝుంఝుం హోటల్ నుంచి రోడ్డు చివర వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు సంబంధించి గతంలోనే నిధులు మంజూరయినప్పటికీ , ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

వ్యర్థాల పారబోత.. జరిమానా

ఎల్‌బీనగర్: యూజర్ చార్జీలు చెల్లించకుండా నిర్మాణ వ్యర్థాలు యథేచ్ఛగా పారబోస్తున్న ప్రైవేట్ ట్రక్కులకు ఎల్‌బీనగర్ జోనల్ అధికారులు సోమవారం జరిమానాలు విధించారు. ఎల్‌బీనగర్ జోనల్ కాప్రా సర్కిల్ పరిధిలో రూ.75 వేలు, ఉప్పల్ సర్కిల్ పరిధిలో రూ.25 వేలు, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో రూ.10 వేలు, ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో రూ.75 వేలు, సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో రూ. 25 వేలు జరిమానా విధించారు. ఐదు సర్కిళ్లలో రూ.2.10 లక్షలు వసూలు చేసినట్టు అధికారులు తెలిపారు. నిర్మాణ వ్యర్థాల కోసం కాప్రా సర్కిల్ పరిధిలో సరాకేతన్, ఉప్పల్ పరిధిలో దేవేందర్ నగర్, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో జీఎస్ఐ రోడ్డులోని డంపింగ్ యార్డులు కేటాయించామని వారు తెలిపారు.

గణిత ప్రతిభ పరీక్షలో విద్యార్థిని సత్తా

మహేశ్వరం: తెలంగాణ గణిత ఫోరం వారు హయత్‌నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత ప్రతిభ పరీక్షలో మహేశ్వరం మోడల్ స్కూల్‌కి చెందిన 10వ తరగతి పి.సాయి చరిత జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. నిజామాబాద్ జిల్లాలో త్వరలో జరిగే రాష్ట్రస్థాయిలో నిర్వహించే గణిత ప్రతిభ పరీక్ష పోటీకి ఎంపిక కావడం జరిగింది. ఎంపికై న విద్యార్థికి సోమవారం రూ.2 వేల రూపాయల నగదుతో పాటు, జ్ఞాపికను నిర్వాహకులు అందజేశారు.



విద్యార్థిని సాయి చరితను అభినందిస్తున్న గణిత ఫోరం సభ్యులు

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్, గణిత ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారం



ద్వారకానగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే

హస్తినాపురం: నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో రూ.2.91 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. భీమానగర్ కాలనీలో పార్కు ప్రహరీ నిర్మాణ పనులతో పాటు సాయిగణేశ్‌నగర్ కాలనీ, సాగర్ ఎన్‌క్లేవ్ కాలనీ, ద్వారకానగర్ కాలనీ, విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ, ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు సుధీర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వాటిలో చాలా సమస్యలు పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మానాయక్, ద్వారకానగర్ కాలనీ ప్రతినిధి నర్సింహారెడ్డి, రఘుమారెడ్డి, శివారెడ్డి, నాగిరెడ్డి, సయ్యద్, చారి, లిక్కి ఇంద్రారెడ్డి, సాయి యాదవ్, శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: వచ్చే నెల 16న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ నాయకులు వీరయ్య, కట్ట శ్రీనివాస్, గోపినాయక్ పిలుపునిచ్చారు. సోమవారం జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి వెంకట్ లక్ష్మి సమ్మె నో టీస్ అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నామన్నా రు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000, పెన్షన్ రూ.10,000 అందించడంతో పాటు విద్యుత్ సవరణ బిల్లు–2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బోధన ఆదర్శం

- ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు పోటీ
- ఫిబ్రవరి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం
- 6వ తరగతిలో 100 సీట్లు, 7నుంచి 10వ తరగతుల్లో..
- ఖాళీ సీట్లకు ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష
- 6 నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఇంగ్లిష్‌లోనే బోధన
- మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు డిజిటల్ తరగతులు
- ప్రతిభ చాటుతున్న మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులు



మహేశ్వరం మోడల్ స్కూల్ భవనం

మహేశ్వరం: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలల ద్వారా గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం ఉచిత విద్యా బోధన అందిస్తోంది. గత సంవత్సరం కళాశాల, పాఠశాల నుంచి విద్యార్థులు జిల్లా ర్యాంకులు సాధించారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి పదోవ తరగతి వరకు పాఠశాల అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 22వ తేదీ వరకు 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి నోటిఫికేషన్ వెలువడింది.

ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలి. మోడల్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం ఉంది. మహేశ్వరం మోడల్ స్కూల్‌లో గత సంవత్సరం పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 97శాతం ఉత్తీర్ణత సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధనలో విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మండల కేంద్రంలో, కందుకూరు మండలం నేదునూరు గ్రామంలో మోడల్ స్కూల్స్ ఉన్నాయి.


మోడల్ స్కూల్ ప్రత్యేకత, విద్యార్థులకు వసతులు

ఆదర్శ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అనేక వసతులను ప్రభుత్వం కల్పిస్తోంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఇందులో ఉంది. పాఠశాలల్లో గ్రంథాలయాలు, ల్యాబ్ సౌకర్యం, అధునాతన ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, విశాలమైన తరగతి గదులు, విశాలమైన ఆట స్థలం, ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ, ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్, ఎంసెట్ కోచింగ్‌లను నిర్వహిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యం కల్పించబడును. క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. స్కౌట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో ఎన్‌సీసీ శిక్షణ ఏర్పాటు కానుంది. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌సిప్(ఎన్ఎంఎంఎస్) ప్రత్యేక శిక్షణ తరగతులు. గత సంవత్సరం ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కి స్కూల్‌కి చెందిన గత మూడు సంవత్సరాల నుంచి సుమారు 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. 2021–22 విద్యా సంవత్సరంలో స్కూల్ నుంచి బాసర ట్రిపుల్ ఐటీకి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. 20 కంప్యూటర్స్, 20 మినీ ల్యాప్‌టాప్‌లు, రెండు ప్రొజెక్టర్లు, హై స్పీడ్ ఇంటర్‌నెట్ సౌకర్యంతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో డిజిటల్ తరగతులు. ఆహ్లాదమైన పాఠశాల ప్రాంగణం, విశాలమైన క్రీడా మైదానాలు అందుబాటులో ఉన్నాయి.

దరఖాస్తు విధానం

తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూళ్లలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశపరీక్షల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జనవరి 12 నుంచి మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఫిబ్రవరి 22వ తేది వరకు చివరి గడువు పొడిగించారు. ఏప్రిల్ నెలలో ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఎప్రిల్ 7వ తేదీల్లో అర్హత పరీక్ష ఉంటుందని, అనంతరం ఫలితాలను వెల్లడించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు పాఠశాలను సందర్శించాలన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి



మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఉచిత యూనిఫాం, మధ్యాహ్న భోజనం , 9వ తరగతి నుంచి రిటైల్ మేనేజ్‌మెంట్, టూరిజం హాస్పిటాలిటీ వృత్తి విద్యా కోర్సుల శిక్షణ ఇస్తారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

బి.ధనుంజయ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్, మహేశ్వరం